

అందుబాటులో యూరియా నిల్వలు

వడ్నపు రాజేందర్, సీఈవో, పీఏసీఎస్, మిర్జాపూర్

ప్ర: సొసైటీ పరిధిలో యూరియా నిల్వల పరిస్థితి ఎలా ఉంది?

జ: సొసైటీ ఇప్పటివరకు ఈ వానకాలపు సీజన్‌కు సంబంధించి 263 మెట్రిక్ టన్నులు (5850 బస్తాలు) సరఫరా అయ్యాయి. మంగళవారం ఉదయం సమయానికి సొసైటీ పరిధిలో 13.95 మెట్రిక్ టన్నుల (310 బస్తాలు) యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

ప్ర: యూరియా విక్రయాలు ఏవిధంగా చేపడుతున్నారు?

జ: రైతుకు సంబంధించి పట్టాదారు పాసు పుస్తకం, ఆధారుకార్డు జిరాక్స్ ప్రతులను తీసుకొని పీవోఎస్ మిషన్ ద్వారా వేలిముద్ర ఆధారంగా విక్రయాల ప్రక్రియను నిర్వహిస్తున్నాం.

ప్ర: యూరియా నిల్వల సరఫరా సక్రమంగా కొనసాగుతోందా?

జ: సొసైటీకి యూరియా నిల్వల సరఫరా సమృద్ధిగా జరుగుతోంది. ఆన్‌లైన్ విధానంలో నిల్వల ముగింపు స్థితిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు అందుకు అనుగుణంగా కేటాయింపులు చేపట్టి సరఫరా గావిస్తున్నారు. కొరత తలెత్తకుండా సరఫరా అవుతున్న నేపథ్యంలో విక్రయ ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది.

ప్ర: సొసైటీ పరిధిలోని సభ్యులు, వారికిచ్చిన రుణాలు ఏంటి.?.

జ: సొసైటీ పరిధిలో మొత్తం 4,882 మంది సభ్యులున్నారు. వీరిలో 1,497 మంది సభ్యులకు పంట రుణాలు, 247 మంది సభ్యులకు దీర్ఘకాలిక రుణాలు, 67 మంది సభ్యులకు కర్షక మిత్ర రుణాలను అందించాం.

● ఆంధ్రజ్యోతి, భైంసా



లక్ష్మణచాంద మండలం న్యూ కంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఇదే..

- అసైన్డ్ భూములుగా పట్టా భూములు
- వెయ్యి ఎకరాలకు పైగా మారిన వైనం
- నిలిచిపోయిన క్రయవిక్రయాలు
- ఇబ్బందులు పడుతున్న వందలాది కుటుంబాలు
- ఏళ్ల నుంచి పరిష్కారానికి నోచుకోని సమస్య

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

నిర్మల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారుల అనాలోచిత చర్య ఆ గ్రామానికి శాపంగా మారింది. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంతో దాదాపు 300 రైతుకుటుంబాలు తమ సమస్యను పరిష్కరించాలని ఏళ్ల నుంచి కోరుతున్నా ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని న్యూకంజర్ గ్రామరైతులు ధరణి కారణంగా తమ భూములపై పూర్తిస్థాయి హక్కులను కోల్పోయారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరావాస గ్రామమైన న్యూకంజర్ రైతులకు 1982లో ప్రతి కుటుంబానికి 5 ఎకరాల చొప్పున వ్యవసాయ భూములను కేటాయించారు. డీ వన్ పట్టాలతో సేత్వార్లు జారీ చేసి సబ్ డివిజన్ ఏర్పాటు చేశారు. దీంతో ఈ భూములపై రైతులకు పూర్తి హక్కులు వచ్చాయి. ఈ భూములను అమ్ముకునే అధికారం కూడా వారికి దక్కింది. అప్పటి నుండి చాలా మంది రైతులు తమ భూములను అమ్ముకోవడం ఇతరుల భూములను కొనుక్కోవడం జరుగుతుంది. ఈ భూములకు రిజిస్ట్రేషన్లు సైతం కావడమే కాకుండా పహానిలలో వారి వివరాలు సైతం నమోదయ్యాయి. అయితే ధరణి పోర్టల్ మొదలు కాగానే ఈ ఊరిలోని భూముల రకంకు సంబంధించిన వివరాలన్నీ అసైన్డ్‌గా నమోదయ్యాయి. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో ఈ భూములు క్రయవిక్రయాలకు పనికిరాకుండా పోయాయి. ఇక్కడి భూముల సర్వే నెంబర్లు అన్ని అసైన్డ్ భూముల జాబితాల్లోకి చేరిపోవడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో ఈ భూముల వివరాలన్నీ బ్లాక్ లిస్టులోకి చేరిపోయాయి. ఎస్సారెస్పీ పరిధిలోని 63 ముంపు గ్రామాలలో ఎక్కడా లేని విధంగా కేవలం ఈ ఒక్క గ్రామానికే అసైన్డ్ వ్యవహారం శాపంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే తమ భూములను అసైన్డ్ జాబితా నుంచి తొలగించి పట్టా భూములుగా మార్చాలని ఈ గ్రామస్థులు దాదాపు పదేళ్ల నుంచి అటు అప్పటి మంత్రులు, ప్రస్తుత మంత్రులతో పాటు అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో ఆ గ్రామానికి చెందిన దాదాపు 412 రైతు కుటుంబాలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నా యి. వైద్యఖర్చులకు గాని పిల్లల పెళ్లిళ్ల కోసం తమ భూములు అమ్ముకోవడం కష్టంగా మారుతుందని వారంతా వాపోతున్నారు.

అరణ్య రోదనగా రైతుల గోడు

న్యూకంజర్ గ్రామస్థులు తమ భూములను అసైన్డ్ జాబితా నుంచి తొలగించి పట్టా భూములుగా మార్చాలని కోరుతూ గత పదేళ్ల నుంచి అప్పటి మంత్రుల చుట్టే కాకుండా ప్రస్తుత మంత్రుల చుట్టూ సైతం తిరుగుతున్నారు. ఇటీవలే భైంసా పర్యటనకు వచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి కూడా తమ సమస్యలను తీసుకుపోయినట్లు ఆ గ్రామస్థులు పేర్కొంటున్నారు. గతంలో కూడా అప్పటి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, అప్పటి సీఎం కేసీఆర్‌కు కూడా తమ గోడును వెల్లబోసుకున్నామని తెలిపారు. అయినా అధికారులు ఈ దిశగా స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్కారు వద్దకు సమస్య

2023లో అప్పటి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ న్యూకంజర్ గ్రామంతోపాటు పొట్టపల్లి(బి), పొట్టపల్లి(కే) గ్రామానికి సంబంధించిన 611 సబ్ డివిజన్‌లను, సర్వే నెంబర్లకు సంబంధించిన భూములను టీఎం 33 మాడ్యూల్ కింద డాటా కరెక్షన్ ద్వారా అసైన్డ్ భూముల జాబితా నుంచి పట్టా భూములుగా మార్చాలని కోరుతూ సీసీఎల్‌ఏకు లేఖ కూడా రాశారు. మొత్తం మూడు గ్రామాలకు సంబంధించిన 433 మంది పట్టాదారుల నుంచి 415మంది దరఖాస్తులు చేసుకున్నారని, మరో పద్దెనిమిది మంది కూడా దరఖాస్తులు చేసుకుని సిద్ధంగా ఉన్నారంటూ అప్పటి కలెక్టర్ ఆ లేఖలో వివరించి, వెంటనే అసైన్డ్ భూముల జాబితా నుంచి తొలగించాలని సైతంకోరారు. అయినా ఉన్నతాధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో దాదాపు 312 మంది రైతులు తమ భూములపై పూర్తిస్థాయి హక్కులను దక్కించుకోలేకపోతున్నారు. పొట్టపల్లి(బి) గ్రామంలో 84 ఎకరాలు, పొట్టపల్లి(కే) గ్రామంలో 37 ఎకరాలు భూములు కూడా అసైన్డ్ జాబితాలోకి చేరాయి. ఈ గ్రామస్థులు కూడా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించండి

● నల్ల లక్ష్మారెడ్డి, రైతు, న్యూకంజర్

మా గ్రామంలోని పట్టా భూములన్నీ అసైన్డ్ భూములుగా మారిపోయాయి. ధరణి పుణ్యమా అని మా భూములను మేము అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో మా భూముల క్రయవిక్రయాలు జరిగినా ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి తమ భూములు బ్లాక్‌లిస్టులో చేరారు. ఇప్పటికే చాలాసార్లు అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయాం. అయినా ఫలితం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈదిశగా చర్యలు తీసుకోవాలి.



కడెం ప్రాజెక్టును సందర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కడెం ప్రాజెక్టును సందర్శించిన మంత్రి

- అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు

కడెం/ఖానాపూర్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): కడెం ప్రాజెక్టును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండేవిఠల్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్, కలెక్టర్ అభిలాష అభినవ్‌లతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు అధికారులు మంత్రికి నివేదించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా పంట పొలాలు, గృహాలు, రహదారులు నష్టపోయాయని, సర్వేఅనంతరం బాధితులకు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.9కోట్లు మంజూరు చేశామన్నారు. కడెం ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ భూమన్న, వైస్ చైర్మన్ అబ్దుల్ మాజీద్, ఆత్మకమిటీ చైర్మన్ తోట సత్యం, కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, కడెం మండల అధ్యక్షులు మల్లేష్, తదితరులున్నారు.

తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి: మంత్రి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నిర్మల్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, పరివాహక ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. భారీవర్షాలు, వరదల కారణంగా రహదారులు, వంతెనలు, నివాస గృహాలు దెబ్బతిన్న నేపథ్యంలో సంబంధిత శాఖలు తక్షణమే సర్వే చేసి నివేదికలను సిద్ధంచేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు అందించాలని ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ అభిలాష అభినవ్ మండలాల వారీగా, శాఖల వారీగా భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని ఫొటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మబొజ్జు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మెగాఆరోగ్య శిబిరంలో మాట్లాడుతున్న మేనేజర్ మహేష్‌మిట్ట

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో

ఉచిత మెగా ఆరోగ్య శిబిరం

భైంసారూరల్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్థాపించి 60ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం భైంసాలోని మాటేగాంలో ఉచిత ఆరోగ్య మెగా శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సికింద్రాబాద్ డివిజన్ ఐవోపీఎల్ మేనేజర్ మహేష్‌మిట్ట ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ నిరుపేదలకు వైద్యం అందించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టామని, శిబిరంలో 300లకు పైగా రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ దామోదర్‌రెడ్డి, డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ నగేష్, డాక్టర్ స్నేహ రెడ్డి, డాక్టర్ ముత్యంరెడ్డి, డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ కుమార్ యాదవ్, డా క్టర్ మనోజ్, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ నమిత, కృపాగ్యాస్ సప్లయర్స్ యజమాని వి.సత్యనారాయణగౌడ్, మాజీసర్పంచ్‌లు లక్ష్మణరావుపటేల్, మధుసూదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అటవీశాఖ అడ్డుపడుతోంది

- మంత్రి జూపల్లికి జడ్పీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అటవీ శాఖ అడ్డు పడుతోందని జడ్పీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం నిర్మల్ వచ్చిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న నిరుపేదలకు ప్రతి దానికి అనుమతి అంటూ ఇబ్బందులు పెడుతున్నారని మంత్రికి విన్నవించారు. పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి వినతి పత్రాన్ని స్వీకరించి న అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మానానికి ఎటువంటి ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు.

ముజ్గికి బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంకు వినతి

నిర్మల్ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముజ్గి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ పెద్దోళ్ల లావణ్య మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పై చదువుల కోసం నిర్మల్ వెళ్లడానికి ఇబ్బంది కలుగుతుందని, బస్సు సౌకర్యం లేక పై చదువులకు వెళ్లలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో బద్దం లింగారెడ్డి, తోట గంగాధర్, కోల్కొండ నర్సయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల ఆందోళనలు



భైంసాలో ధర్నా చేస్తున్న ఆశాకార్యకర్తలు



కుభీర్‌లో నిరసన తెలుపుతున్న ఆశాలు



కడెంలో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

భైంసా, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆశా కార్యకర్తలు చేపట్టిన ఆందోళనలు హోరెత్తాయి. రాష్ట్రశాఖ పిలుపు మేరకు మంగళవారం భైంసా పట్టణ, మండల పరిధిలోని ఆశ కార్యకర్తలు అర్బన్ పీహెచ్‌సీ ముందు ఆందోళనలు చేపట్టారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆశలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం అక్కడే భైఠాయించి ధర్నాకు దిగారు. పెండింగ్‌లోనున్న పారితోషికాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం అర్బన్ పీహెచ్‌సీలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు.

కడెం: ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన రెండు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని మంగళవారం మండలకేంద్రమైన కడెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మండలంలో ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ఆశావర్కర్ల సంఘం కడెం మండల అధ్యక్షురాలు ఎం.జ్యోతి మాట్లాడుతూ ఆశావర్కర్లకు గత రెండు నెలల నుంచి వేతనాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని కోరుతూ సెప్టెంబరు 1న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కడెం పీహెచ్‌సీ డాక్టర్ శివ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కడెం మండలంలోని పలు గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుభీర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట మంగళవారం ఆశావర్కర్లు నిరసన తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారికి అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఏటీసీలతో టెక్ శోభ

- ముథోల్, సత్తెనపెల్లిలలో ఏర్పాటు
- టాటా టెక్నాలజీ సౌజన్యంతో స్థాపన
- ఒక్కో కేంద్రానికి రూ.45.15 కోట్లు
- ప్రాంతీయాభివృద్ధికి తోడ్పడనున్న కేంద్రాలు
- ఉపాధి కల్పనకు మార్గం సుగమం: ఎమ్మెల్యే

భైంసా, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రగతికి మరో మంచి అవకాశంగా రెండు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలు మంజూరయ్యాయి. సోమవారం కార్మిక ఉపాధి శిక్షణ, పరిశ్రమల శాఖ జీవో 8 ద్వారా ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం 46 ఏటీసీ కేంద్రాలు మంజూరు చేయగా ఇందులో నిర్మల్ జిల్లా పరిధిలోని ముథోల్, ఖానాపూర్‌లోని సత్తెనపెల్లిలో కేంద్రాలకు చోటుదక్కింది. టాటా టెక్నాలజీ లిమిటెట్ సౌజన్యంతో ప్రభుత్వం ఒక్కో ఏటీసీ కేంద్రానికి రూ.44.15 కేటాయించనుంది. దీంతో ప్రాంతీయ స్థాయిలో ఆధునిక సాంకేతికరంగ అభివృద్ధికి అవకాశలు మెరుగుపడనున్నాయి.

పరిశోధన-ఆవిష్కరణకు వేదిక

ఈ కేంద్రాల ఏర్పడడం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, యువతకు కొత్త ఆవిష్కరణల దిశగా అవకాశాలు లభించనున్నాయి. రోబోటిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటి రంగం, హెల్త్‌కేర్ టెక్నాలజీలు వంటి విభాగాల్లో శిక్షణలు, ప్రాజెక్టులు నిర్వహించబడతాయి.

పరిశ్రమల అభివృద్ధి - ఉద్యోగవకాశాలు

ఏటీసీ ద్వారా పరిశ్రమలు ఆధునిక సాంకేతిక విధానాలు అందుబాటులోకి రానున్నాయి. ఉత్పత్తుల నాణ్యత పెరగడం, ఖర్చులు తగ్గుతాయి. ఫలితంగా కొత్త సాఫ్ట్‌వేర్‌లు, పరిశ్రమలు ఏర్పడి ప్రాంతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యోగవకాశాలు కలుగుతాయి.

సామాజిక ప్రయోజనం

సాంకేతికత ఆధారంగా వైద్యరంగంలో టెలీమెడిసిన్, మెడికల్ పరికరాల తయారీ, వ్యవసాయ రంగంలో యంత్రాంగ వినియోగం, విద్యారంగంలో డిజిటల్ లెర్నింగ్ అభివృద్ధి చెందుతాయి. పర్యావరణ అనుకూల టెక్నాలజీల అభివృద్ధితో అభివృద్ధి సాధ్యమవుతోంది.

ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దారి..

ఏటీసీ ఏర్పాటుతో పెట్టుబడులు ఆకర్షితమవడంతో పాటు గ్లోబల్ స్థాయిలో పోటీ పడగలిగే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుంది. దీంతో ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలపడే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. ఉద్యోగ,ఉపాధి అవకాశాల మెరుగుకానున్నాయి. ఏటీసీ కేంద్రాల ఏర్పాటు జిల్లా యువతకు ఒక వరంగా పేర్కొనవచ్చు.

ఒక్కో కేంద్రానికి రూ.44.15 కోట్ల వ్యయం

ఒక్కో కేంద్రంఏర్పాటుకు రూ.44.15 కోట్ల వ్యయం కానుంది. టాటా టెక్నాలజీ లిమిటెడ్ రూ.31.01కోట్లు వాటగా అందిస్తుండగా మిగతా రూ.14.14 కోట్లు ప్రభుత్వం భరించనుంది. టాటా టెక్నాలజీ వాట రూ.31.01 కోట్ల ద్వారా ఏటీసీ కేంద్రాలకు మిషనరీ, సాఫ్ట్‌వేర్, టూల్స్, పరికరాలు సమకూరనున్నాయి. ఇక ప్రభుత్వ వాట రూ.14.14 కోట్లను ఏటీసీ కేంద్ర వర్క్‌షాప్స్ నిర్మాణం, బోర్‌వెల్స్, నీటి సరఫరా వ్యవస్థ, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, తరగతి గదులు, గ్రంథాలయం, ఫర్నిచర్, బుక్స్, స్టేషనరీ, నిర్వాహణ వ్యవస్థ, రా మెటీరియల్, శిక్షణ తదితర వాటికి వ్యయం చేయనున్నారు.



యువతకు సువర్ణ అవకాశం

● పవార్ రామరావ్ పాటిల్, ఎమ్మెల్యే



ఏటీసీ మంజూరు కావడంతో ముథోల్ నియోజకవర్గ యువతకు సువర్ణ అవకాశం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుకానున్నాయి. సాంకేతిక విధానాలు అందుబాటులోకి రానుండటంతో ప్రగతికి బాటలు మెరుగుపడనున్నాయి.

నేడు విద్యాసంస్థలకు సెలవు: కలెక్టర్

నిర్మల్, ఆంధ్రజ్యోతి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా నేడు (బుధవారం) నిర్మల్ జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. విద్యార్థుల రవాణా, ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతవారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు జలమయం కావడం, చెరువులు, ప్రాజెక్టులు నిండిపోవడం, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు ప్రయాణించడం కష్ట సాధ్యమని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9100577132లో సంప్రదించవచ్చని తెలిపారు.

నేటి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం వాయిదా

నిర్మల్‌రూరల్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): భైంసా క్యాంప్ ఆఫీస్‌లో బుధవారం నిర్వహించే ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని భారీ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఎస్పీ జానకీ షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ కబడ్డీ యువ సిరీస్‌కు రవి ఎంపిక



నిర్మల్‌రూరల్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ యువ కబడ్డీ సిరీస్‌కు జోగులాంబ లయన్స్ జట్టుకు జిల్లాకు చెందిన లక్ష్మతివార్ రవి ఎంపికయ్యారని జిల్లాకబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సునీల్, అధ్యక్షులు భూపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రవిని జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

'చలో సురలోక్ గార్డెన్‌ను విజయవంతం చేయండి'

కుభీర్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): వికలాంగు చేయూత పెన్షన్ దారుల మహాగర్జన కార్యక్రమంలో భాగంగా ఈనెల 22న భైంసాలో నిర్వహించనున్న చలో సురలోక్ గార్డెన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ పీఆర్‌పీఎస్ అధ్యక్షులు నమత్కర్ దిగంబర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గొడిసెర గ్రామంలో ఆయన మాట్లాడుతూ పింఛన్లను పెంచుతామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, లింగా సర్పంచ్, నాయకులు శంకర్, ఆనంద్‌రావుపాటిల్, తదితరులున్నారు.

పంటలను ముంచిన ముసురు..



తలమడుగులో భారీ వర్షాలకు నీట మునిగిన పత్తి పంట



ఉప్పొంగి ప్రవహిస్తున్న డోర్లిలో లోలెవల్ వంతెన

- కర్షకులకు తప్పని కన్నీటి కష్టాలు...
- మండలంలో రెండు వేల ఎకరాల్లో పంట నష్టం

తలమడుగు/ఆదిలాబాద్‌టౌన్/నేరడిగొండ/భీంపూర్,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చేతికొచ్చే నాపంట కండ్ల ముందరే నీట మునగడంతో రైతులకు కన్నీటి కష్టాలు తప్పడం లేదు. భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో దాదాపు రెండువేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. గ్రా మాల వారీగా పంటలు నష్టపోయిన వ్యవసాయ పొలాల్లో పర్యటించి పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. పంటలు నష్టపోయిన రైతులు తమ పంట వివరాలను పట్టా పాస్ అకౌంట్ నెంబర్‌తో సహా వివరాలు సమర్పించాలన్నారు. అదేవిధంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభు త్వం ఎకరానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.అదేవిధంగా భారీ వర్షాలతో పంటలతో పాటు పలు గ్రామాల్లో పాత ఇల్లు కూలిపోయాయి. అంతేకాకుండా భారీ వర్షాలతో రోడ్లు మరమ్మతులకు లోనయ్యాం యి. ఆయా గ్రామాల్లోనిలో లెవెల్ వంతెనలు ఉప్పొంగి ప్రవహించడంతో ప్ర యాణికులకు ఇబ్బందులు తప్పలేదు.లో లెవెల్ వంతెనాలను హై లెవెల్ వంతెనగా నిర్మించాలని పలుమాలు గ్రామీణ ప్రజలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఎవరు పట్టించుకోలేదన్నారు. కేవ లం వరదలు వచ్చిన సమయంలోనే హామీలు ఇస్తున్నారు తప్ప వాటిని అమలు పరచడం లేదని సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భారీ వర్షాలతో నష్టపోయిన రైతుల జరిగే నష్టపరిహారం అందించాలని మండల వాసులు కోరుతున్నారు. ఇటీవల జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని బీఆర్‌ఎస్ నేతలు కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణ రావుకు వినతిపత్రం అందించారు. ఇండ్లు దెబ్బ తిన్నవారికి ఆండగా నిలవాలని, కోతకు గురైన రోడ్లు, వంతెనలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు సయ్యద్ సాజిదోద్దీన్, అలాల్ అజయ్,మర్శెట్టి గోవర్ధన్, దేవిదాస్, వేణుగోపాల్ ఉన్నారు.

వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

పీసీసీ అధ్యక్షుడి హోదాల్లో ప్రస్తుత. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరదలతో నష్టపోయిన రైతాంగానికి 25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారని, ప్రస్తుతం వరద బీభత్సం తో నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఎకరానికి 25 వేల పరిహారం చెల్లించాలని మాజీమంత్రి జోగు రామన్న అన్నారు. నేషనల్ హైవే 44వ జాతీయ రహదారిపై ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.సంబంధిత అధికారులు తక్షణమే రోడ్డుపై పడ్డ గుంతలను పూడ్చి వేయాలని వాహన చోదకులు.

భీంపూర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల నష్ట పోయిన పంటలను మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ సీనియర్ నాయకుడు బండి దత్తాత్రిలు వారి బృందంతో కలిసి మండలంలోని పిప్పల్కోటిలో ముంపు రైతుల పంటలను పరిశీలించారు. అలాగే ఇండ్లలోకి వర్షపు నీరు చేరి ఇండ్లు దెబ్బ తిన్న వారి ఇళ్ళకు వెళ్ళి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంజుల, గంగా సాగర్, అరిఫా బేగం, అగ్గిమల్ల స్వామి, పండుగ పోచన్న, దోని పెళ్లి స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట క్షేత్రాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి పరిశీలించారు. కడెం నది పరివాహక ప్రాంతాలైన కుప్టి. కుమారి.. తర్లం, వాగ్దారి గ్రామాల్లో పత్తి. సోయ పంటలను పరిశీలించారు. నష్టపోయిన పంటలను వ్యవసాయ విస్తీర్ణ అధికారులు గ్రామాల వారీగా వచ్చి పరిశీలిస్తారని ఆమె అన్నారు.

చేప పిల్లలు.. వచ్చేస్తున్నాయ్

(5వ పేజీ తరువాయి...)

అంతంత మాత్రంగానే వర్షపాతం నమోదు కావడంతో చేప పిల్లల పంపిణీపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆగస్టు మూడవ వారంలో మాత్రం భారీ వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. అత్యధిక వర్షాలతో చెరువులు మత్తడి పోర్లి పారడంతో గతంలో పెంచిన చేపలను నష్ట పోవాల్సి వచ్చింది. సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 286.50 మీటర్లు కాగా ప్రస్తుతం 285.00 మీటర్లకు చేరింది. అలాగే మత్తడివాగు ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 277.50 మీటర్లు కాగా.. ప్రస్తుతం 276.15 మీటర్లకు చేరుకుని జలకళను సంతరించుకున్నాయి. మారుమూ ల గ్రామాల్లోను చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీటి నిల్వలు కనిపిస్తున్నాయి. ఈ యేడు జిల్లా వ్యాప్తంగా 714.4 మి.మీ.ల సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా.. ఇప్పటి 812.9 మి.మీ.ల అత్యధిక వర్షపాతం నమోదైంది. దీంతో చేప పిల్లల పెంపకానికి ఈ సారి ఢోకా లేదన్న ధీమా మత్స్యకార్మికుల్లో వ్యక్తమవుతోంది.

టెండర్లపై అనుమానాలు

అధికారులు టెండర్ ప్రక్రియను ప్రారంభించినా వ్యాపారులు టెండర్లు వేసేందుకు ముందుకు వస్తారో? రారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే గతేడు సరఫరా చేసిన చేప పిల్లలకు సంబంధించిన బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. జిల్లాకు సుమారుగా రూ.40 లక్షల వరకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఒక వేళ ఈసారి టెండర్లు వేసినా.. బిల్లులు ఎప్పుడు వస్తాయో? తెలియని పరిస్థితి ఉందంటున్నారు. గతేడు కూడా వ్యాపారులెవరూ ముందుకు రాకపోవడంతో రెండు మూడు సార్లు టెండర్లు పిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో టెండర్లు వేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపరన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో సాత్నాల ప్రాజెక్టు వద్ద నిర్వహిస్తున్న ఫాంను వరదనీరు ముంచెత్తడంతో దాదాపుగా 30 లక్షల వరకు చేప పిల్లలు వరదనీటిలో కొట్టుకుపోయినట్లు తెలుస్తోం ది. టెండర్లు ఆలస్యమయితే చేపపిల్లల పంపిణీకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందంటున్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి



మంత్రి జూపల్లిని కలిసిన ముథోల్ మాజీ ఎమ్మెల్యే

భైంసా, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా నియోజకవర్గ పరిధిలో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మత్తులు నిర్వహింప చేయాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి జిల్లా ఇంఛార్జీ మంత్రి జూపల్లికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఇంఛార్జీ మంత్రి జూపల్లిని నిర్మల్ కేంద్రంలో నియోజక వర్గ కాంగ్రెస్ ప్రతినిధులతో కలిసి సంబంధిత విషయంలో వినతి పత్రం అందచేశారు. అర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్లతో పాటు పలు కాజ్‌వేలు, కల్వర్టులు దెబ్బతిన్నట్లుగా వివరించారు. ఇదే క్రమంలో పలు ప్రాంతాల్లోని పంటలు దెబ్బతిని రైతులు కష్టనష్టాల పాలయ్యారని తెలిపారు. దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించి నష్టపరిహారం అందింప చేసేందుకు కృషి చేయాలని కోరారు.

బ్రిడ్జిపై నుంచి లారీ బోల్తా

నేరడిగొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బ్రిడ్జిపై నుంచి వాహనం కింద పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం నేరడిగొండ మండలంలోని కుప్టి వద్ద చోటుచేసుకుంది. ఇచ్చోడ సిఐ రాజు కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాగ్ పూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఐచర్ కంటెయినర్ వాహనం నేరడిగొండ మండలంలోని కుప్టి వంతెన వద్ద అదుపు తప్పి వంతెన పైనుంచి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సువతే అనిల్ (38) క్యాబిన్‌లోనే ఇరుకొని మృతి చెందాడు. మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బైటికి తీశారు. అతివేగంగా అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని సిఐ రాజు తెలిపారు. ఎస్ఐ ఇమ్రాన్ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పురుగుల మందు తాగిన బాలుడు

బోథ్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని సాగర గ్రామానికి చెందిన రాథోడ్ ఆత్మారాం మనిషాల కుమారుడు రిషి మూడు సంవత్సరాలు. ఇంట్లో ఆడుకుంటూ మంగళవారం అందుబాటులో ఉన్న పురుగుల మందు డబ్బా తీసుకొని తాగడం జరిగింది. గమనించిన కుటుంబీకులు వెంటనే బోథ్ ఆసుపత్రికి తరలించారు. బోథ్ ఆసుపత్రిలో బాలునికి ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. కాగా బాలుడికి ప్రాణాపాయం లేదని స్థానిక వైద్యులు పేర్కొన్నారు.

మోకాలిలోతు నీటిలో స్మశానవాటిక

బోథ్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్మశాన వాటికలో నీరు నిలిచిపోవడంతో స్మశాన వాటికలకు వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదని పట్టణ ప్రజల పేర్కొంటున్నారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు స్మశాన వాటికలో మోకాలి లోతు నీరు నిలిచిపోవడంతో శవాలను తీసుకువెళ్లడం సవాల్‌గా మారింది. అధికారులు స్మశాన వాటికలో ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు. చచ్చిన శవం తీసుకెళ్లాలంటే మోసుకు వెళ్లే వారికి చచ్చేంత పని అవుతుందని వాపోతున్నారు.

ఓట్ల దొంగతనం ప్రజాస్వామ్య హత్యే

● రాంనాథ్ నాయక్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్

ముథోల్,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలో ఇండియా కూటమి ఎంపీలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంనాథ్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. దేశంలో జరుగుతున్న ఓట్ల తొలగింపు కర్ణాటకలో 1 లక్ష ఓట్లు, బీహార్‌లో 58 లక్షల ఓట్లపై వివరణ కోరిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు విపక్ష ఎంపీలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ముమ్మాటికీ ప్రజాస్వామ్య హత్య అని పేర్కొన్నారు. ఓటు ప్రజల శక్తి, దానిని దొంగలించడం అంటే ప్రజాస్వామ్యంకు విరుద్ధమని అన్నారు. ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధ బాధ్యతను వదిలి, కేంద్ర ఒత్తిడికి తలొగ్గి నిశ్శబ్ధంగా వ్యవహరించడం అనుమానాస్పదమని ఆరోపించారు. ఓట్ల దొంగతనానికి నిరసగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఉద్యమానికి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. మీ ఓటు మీ భవిష్యత్తు. దాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరి గొంతు వినిపించాలని కోరారు.

స్వగ్రామానికి చేరుకున్న సురేష్ మృతదేహం

దస్తురాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మున్యాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన సురేష్(32) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంది. సురేష్ ఇటీవలే ఉపాధి నిమిత్తం ఉజ్బెకిస్తాన్ దేశానికి వెళ్లాడు. అక్కడ గుండెపోటుతో మరణించాడు. దాదాపు నెల రోజుల తర్వాత గ్రామానికి చేరుకున్న సురేష్ మృతదేహం చూసి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సురేష్ అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నిత్యావసర సరుకులు పంపిణీ

కడెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కడెం ప్రాజెక్టు క్రింద నీటి ప్రవాహంలో గల్లంతైన కన్నాపూర్ వాసి టి. గంగాధర్ ఆచూకీ ఇప్పటి వరకు తెలియకపోవడంతో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశానుసారం కడెం వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్ వారి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కానూరి సతీష్, మాజీ ఆత్మ చైర్మన్ ఖానాపూర్ బీఆర్ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి ముబారక్ బిన్ మహ్మద్, బీఆర్ఎస్ ఇస్లావత్ గంగాధర్, నాగావత్ రమేష్, తలారి నర్సయ్య, జుబేర్, సాలె బిన్ మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకుంటాం : బోథ్ ఎమ్మెల్యే



కరంజి (టి)లో ముంపు గురైన రైతు శేఖన్నను పలకరిస్తున్న ఎమ్మెల్యే అనిల్

భీంపూర్/తలమడుగు , ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అతివృష్టితో పంట నష్ట పోయిన రైతులు ధైర్యం కోల్పోవద్దని ప్రభుత్వానికి నివేదించి పరిహారం అందేలా చూస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ధైర్యం ఇచ్చారు. మంగళవారం బీంపూర్ మండలం టెక్డి రాంపూర్, కరంజి (టి), అంతర్గవ్, గోమూత్రి, నిపాని, పిప్పల్కోటి తదితర గ్రామాల శివారు ముంపు చల్లను పరిశీలించారు. అంతర్గవ్‌లో పెన్ గంగా ఉధృతి పరిశీలించి ముంపు ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం బాధిత రైతులకు ఎకరాకు రూపాయలు ఇరవ ఐదు వేల చొప్పున పరిహారం మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గంలో దాదాపు 20 వేల ఎకరాల వరకు పంటలు నష్ట పోయాయని పరిహారం కోసం తొందరగా సర్వేలు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డిని అందించాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం మాజీ జడ్పీటీసీ కుంరా సుధాకర్, మాజీ ఎంపీపీ కుడ్మెత సంతోష్, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, బీఆర్ఎస్ నాయకుడు ప్రముఖ న్యాయవాది కేమా శ్రీకాంత్, నాయకులు నరేందర్ యాదవ్, కాల్చప్ యాదవ్, బీఏకేకేవి కపిల్ యాదవ్, గోవర్ధన్ యాదవ్, సంజీవ్ రెడ్డి, మాడావి లింబాజి, రవీందర్ జాదవ్, మాడావి వినోద్, బొంత నితిన్, కేమ రాజన్న తదితరులు ఉన్నారు.తలమడుగులో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో తలమడుగు మండలంలో పంటలు నష్టపోయిన రైతులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రాత్రి 8 గంటల సమయంలో పంట పొలాల్లోకి వెళ్లి పంటలను పరిశీలించి అనంతరం చర్పి కాలనీలో పర్యటించి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాలతో నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందించే ప్రభుత్వంతో పోరాడుతానన్నారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దు అన్నారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పిడుగు సంజీవ రెడ్డి,మహిళా సంఘం జిల్లా నాయకురాలు కాటిపెల్లి సునీతా రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు కే శ్రీనివాస్ రెడ్డి, ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, ఆసం రవి, గంగనా శ్రీకాంత్, సుదర్శన్ రెడ్డి, గంగాదర్ పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

నిర్మల్ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, గౌడ సంఘం నాయకులు పొన్నం నారాయణ గౌడ్, వేణు గౌడ్, రవీందర్, లింగా గౌడ్, సత్యనారాయణ, గణేష్ గౌడ్, లవ కుమార్, వెంకట్, నర్సాగౌడ్‌తో పాటు జిల్లా, పట్టణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ కాలనీ సమస్యల గురించి కమిషనర్‌కు వినతి

నిర్మల్ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దత్తాత్రేయ నగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న డిష్, ఇంటర్నెట్ వైర్లను తొలగించాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. కాలనీ ఏర్పడి 20 సంవత్సరాలు పైబడిన ఇప్పటికి సరైన రహదారులు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు అందుబాటులో లేవన్నారు.ఈ వైర్లు తరచుగా రోడ్డు పైకి పడిపోవడం వలన వాహనదా రులు, పాదాచారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కుంటాల,ఆగస్టు, 19 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో మంగళవారం ఎంపీడీవో వనజ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరాపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఆమెమొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రహీం, ప్రిన్సిపల్ రాజు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సన్నాహక సదస్సు విజయవంతం చేయండి

భైంసారూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణంలోని సూర్యలోక గార్డెన్‌లో 22వ తేదీన సన్నాహక సదస్సుకు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ సన్నాహక సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చే స్తున్నారని ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దిగంబర్ అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు.

వరదలతో దెబ్బతిన్న పంట క్షేత్రాల పరిశీలన

పెంబి,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కడెం వాగులో నీటి ప్రవాహనం పెరిగిన కారణంగా ఏర్పడ్డ వరద ఉధృతితో పస్పుల, తాటిగూడ, లోతర్య తండా, ఇటిక్యాల్ గ్రామాల్లో దెబ్బతిన్న వ్యవసాయ క్షేత్రాలను పంటలను ఇటిక్యాల్ వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఏఈవో వెంట రైతులు పరుశురాం, రాజేందర్, కే. రమేష్, నవీన్, ప్రేమ్ సింగ్, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు షాక్

● కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

నేరడిగొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గుడిహత్నూర్ మండలంలోని మచపూర్, కొలంగూడా గ్రామానికి చెందిన దాదాపు 30 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ లో చేరిన వారు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే, ఆడే గజేందర్‌తోనే సాధ్యమని వారి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదవారికి చేరుతున్నాయి అని అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. చేరిన వారిలో జైవంత్ రావు, లేద్దిరాం, సీతారాం, ఆనంద్ రావు , అయు పటేల్, రాజ్ కుమార్, భీమ్రావు, జంగు సురేష్ దాదాపు 35 మంది చేరారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి రేవంతన్న నాయకత్వంలో పనిచేయాలని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగర వేయడమే లక్ష్యంగా ముందు కెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడే వసంతరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలేటి రాథోడ్ రమేష్, రాథోడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


చెత్త తొలగింపు

బోథ్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని పలు గ్రామాలను మంగళవారం తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఆర్ఐ శ్యాంసుందర్ రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కోట గ్రామం వద్ద ఉన్న వంతెన కింద చెత్త పేరుకుపోవడంతో వరద నీరు రోడ్డుపై నుండి ప్రవహించింది. విషయం గమనించి జెసిబి ద్వారా తొలగించడం జరిగింది. అనంతరం మండల కేంద్రంలోని పలు కాలనీలలో పరిశీలించారు. ఈ సందర్భంగా దళిత కాలనీలో పరిసరాలను పరిశీలించి కాలనీవాసులకు తగు సూచనలు చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో డీసీసీబీ వైస్ చైర్మన్

దిలావర్‌పూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి తన పుట్టిన రోజు వేడుకలను శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలోనే కేక్ కట్ చేశారు. ఆలయ చైర్మన్ అంగూర్ మహేందర్ డీసీసీబీ వైస్ చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు

గత సీడీపీవోపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ



విచారణ అధికారికి ఆధారాలను అందజేస్తున్న ఆయా సంఘాల నాయకులు

ఖానాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌లో గత కొద్ది రోజుల క్రితం వరకు పని చేసిన సీడీపీవోపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఖానాపూర్ ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం విచారణ జరిగింది. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ విచారణ నిర్వహించినట్లు విచారణ అధికారి, నిజామాబాద్ డిడబ్ల్యూవో రసూల్ బి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో అందిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని మార్చ్ నెలలో తమ బృందాన్ని రాష్ట్ర అధికారులు నియమించారన్నారు. రాష్ట్ర అధికారుల ఆదేశాలతో విచారణ నిమిత్తం ఖానాపూర్ ఐసీడీఎస్ కార్యాలయానికి వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో భాగంగా పలువురిని విచారించామని నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

● జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలి...

ఖానాపూర్ ఐసీడీఎస్ సీడీపీవోగా విధులు నిర్వహించి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సరితపై జాప్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విచారణ నిమిత్తం హాజరైన నిజామాబాద్ డీడబ్ల్యూవో రసూల్ బికి పలు ఆధారాలను అందజేశారు. సీడీపీవో సరితపై వచ్చిన ఆరోపణలను తాము ఆధారాలతో సహా అధికారులకు అందజేసిన చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు.ఇదివరకే పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇక్కడ జరుగుతున్న విచారణ అంతా బుట్ట దాఖలు అయ్యిందన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారికి ఇటీవల ఉత్తమ ప్రశంసా పత్రం ఇవ్వడం వెనుక అంతర్యం ఏంటని ప్రశ్నించారు. ప్రతి నెల అంగన్‌వాడీ టీచర్ల వద్ద రూ. 400ల చొప్పున వసూలు చేయడమే కాకుండా వేసవి సెలవుల పేరిట టీచర్ ఆయాల వద్ద తలో రూ. 1000 చొప్పున వసూలు చేశారన్నారు. ఇలా ప్రాజెక్టు పరిధిలో ఎంత అవినీతికి పాల్పడ్డారో ఫోన్ పే రికార్డులతో సహా తాము అందజేశామన్నారు. ఇకనైనా సదరు అధికారిపై చర్యలు తీసుకోకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

పీహెచ్‌సీ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

ఉట్నూర్/దిలావర్‌పూర్ ,ఆగస్టు 19 (ఆం ధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతా ల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల స మస్యలను ప్రభుత్వం వెంట నే పరిష్కరించాలని కోరు తూ సీఐటీయూ అనుబంధ సంస్థ ఆశ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఆశా వర్కర్లు నిరసన ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్లకు వెంట వెంటనే పారితోషికలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు. దిలావర్‌పూర్ ఉద్యోగ నిర్వహణలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు మంగళవారం పీహెచ్‌సీ ముందు ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న పారితోషికం వెంటనే చెల్లించాలని వారు కోరారు. పారితోషికం కాకుండా కనీస వేతనం రూ. 18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కుబీర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల ప్రభలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డా. విజేష్‌రాథోడ్ సూచించారు. జిల్లా కలెక్టరు ఆదేశానుసారం మండలంలోని గ్రామాల్లో షెడ్యూల్డ్ ప్రకారం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం మండలంలోని రంగశివుని తండాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తాండా వాసులకు వైద్య చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడే రోగుల నుండి రక్తనమూనాలను సేకరించారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సూపర్‌వైజర్ సుగుణ, ఎంఎల్‌హెచ్‌పీ పవన్, ఏఎన్ఎం విమల తదితరులున్నారు.

ముథోల్‌కు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్

● ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

ముథోల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో రూ. 45.15 కోట్ల రూపాయల నిధులతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నామని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇక్కడ ఐటీఐ కళాశాల (టెక్నాలజీ సెంటర్) మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రిని కోరడంతో పాటు అసెంబ్లీలో ప్రస్తావించడంతో ముథోల్‌లో ఏటీసీ సెంటర్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషకరమన్నారు. ఏటీసీ ఏర్పాటు కావడం శుభసూచకమన్నారు. రూ. 45.15 కోట్ల నిధులతో భవన నిర్మాణాలు, యంత్రాలు, కంప్యూటర్లు, ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, టాటా కంపెనీకి ఎమ్మెల్యే ధన్యవాదములు తెలిపారు.

భారీ వర్షాలకు కూలిన ఇళ్లు

దస్తురాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంతో పాటు మండలంలోని బుట్టాపూర్ గ్రామంలోని రెండు పాత ఇళ్లు కూలిపోయాయి. మట్టి గోడలు కూలిపోవడంతో అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని ఇంటి యజమానులు తెలిపారు.కూలిన ఇళ్లనుతహసీల్దార్ విశ్వంబర్ పరిశీలించారు.

ఎరువులను అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు

కుంటాల, ఆగస్టు, 19 : (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియాతో పాటు పలు రకాల ఎరువులను అక్రమంగా విక్రయిస్తే ఆ ఎరువుల దుకాణం యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ కమల్ సింగ్,ఎస్సై అశోక్, ఎంపీడీవో వనజ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కుంటాలతో పాటు అంబకంటి తదితర గ్రామాలలో ఎరువుల దుకాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణం యజమానులు రైతు వ్యవసాయ భూమికి అనుగుణంగా మాత్రమే ఎరువులు పంపిణీ చేయాలని, తక్కువ భూమి ఉన్న రైతుకు ఎక్కువ బస్తాలను అందజేసిన, బ్లాక్ మార్కెట్‌లో ఎరువుల బస్తాలు విక్రయించినా, పక్కా రాష్ట్రాలకు ఎరువుల బస్తాలను తరలించిన దుకాణం యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రైతులకు అవసరం మేర అన్నిరకాల ఎరువులు సరఫరా చేస్తుందని ఎరువుల విక్రయంలో అవకతవకలకు పాల్పడవద్దని, ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు అవసరం మేర అన్నిరకాల ఎరువులుసరఫరా చేస్తుందన్నారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవ వేడుకలు

భైంసా, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలో మంగళవారం ఫోటోగ్రాఫర్ల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డివిజన్ ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఇక్కడి ప్రాంతంలోని ఫోటోగ్రాఫర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో బాగంగా కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గోశాలకు వెళ్లి అక్కడ గోమాతలకు పూజలు నిర్వహించి యూనియన్ తరపున గడ్డికట్టలు, కల్లి పిండిని విరాళంగా అందించారు. ఒకరికొకరు మిఠాయిలు తిని పించుకున్నారు. ఇందులో యూనియన్ భైంసా డివిజన్ ఉపాధ్యక్షులు దత్త ప్రసాద్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు విఠల్, సాయిరెడ్డి, నిఖిల్ పాటిల్,ఆకాష్, విజయ్‌తో పాటు డివిజన్ పరిధిలోని ఆయా మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు

నిర్మల్ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల అక్కాపూర్‌లో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ మంగళవారం మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సేంద్రియ ఎరువులు ఉపయోగించి, కూరగాయలు పండించి మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు వడ్డిస్తామని తెలిపారు. విద్యార్థులకు కిచెన్ గార్డెన్‌పై అవగాహన కల్పించి, తమ ఇళ్లలో ఏర్పాటు చేసుకునేలా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ పాల్గొన్నారు.


ప్రమాదకరంగా ఉన్న పులిమడుగు మూలమలుపు


ప్రమాదకరంగా ఉన్న దంతన్ పల్లి మూలమలుపు


ఆర్అండ్‌బీ ఏర్పాటు చేసిన సూచిక బోర్డుకు రంధ్ర పడిన దృశ్యం, దాని పక్కనే పోలీసు శాఖ ఏర్పాటు చేసిన గో స్లో బోర్డు

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు!!

- ఉట్నూర్ ఏజెన్సీలో పలుచోట్ల ప్రధాన రోడ్లపై ప్రమాదకరంగా మూలమలుపులు
- మలుపుల వద్ద దిక్కు లేని దిక్సూచి బోర్డులు
- ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు

ఉట్నూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ గిరిజన ప్రాంతాలలోని ప్రధాన రోడ్ల మూల మలుపులు ప్రమాదాల పిలుపులకు అడ్డాలుగా మారుతున్నాయి. ఉట్నూర్ మండల కేంద్రం నుంచి జన్నారం వైపు వెళ్లే రోడ్లు భవనాల శాఖ రహదారిపై పలు మూల మరుపులు ప్రమాదాలకు నెలువులుగా తయారయ్యాయి. ఉట్నూర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి చెక్ పోస్ట్ కొత్తగూడ వెళ్లే రహదారిపై జాదవ్ చత్రు నగర్ సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొలాంగూడ దుంతన్‌పల్లి సమీపంలో, బీరుసాయిపేట గ్రామంలోని అటవీ శాఖ కార్యాలయం వద్ద ఉన్న మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. అదేవిధంగా ఉట్నూర్ నుంచి గుడిహత్నూరు వెళ్లే రహదారిపై పు లాజి బాబా స్కూల్ సమీపంలో, రామ్ లింగంపేట, పులిమడుగు నా వద్ద ఉన్న మూల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. పులిమడుగు సమీపంలో ఉన్న మూలమలుపుల వద్ద ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల్లో మూడు పదుల సంఖ్య వరకు పలువురు మృతి చెందారు. తరచుగా ప్రతి వారానికి ఓసారి ఈ మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉండడం గమనార్హం. ఇప్పటికైనా రోడ్లు భవనాల శాఖ అధికారులు మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దిక్కులేని దిక్సూచి బోర్డులు..

రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలోని రోడ్లపై ఉన్న మూల మలుపుల వద్ద దిక్సూచి బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉన్న అవి లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. ఏ విపత్తు సంభవించినా.. పోలీసు శాఖపైనే అన్ని శాఖల అధికారులు ఆధారపడి ఉంటున్నారు. కొలాం గూడా, దుంతంపల్లి మధ్య ఉన్న మూల మలుపు వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రమాదకరంగా ఈ మూల మలపు ఉందుంటూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డుకు రంధ్రం పడి ఉంది. ప్రమాదాల నివారణ కోసం రోడ్లు భవనాల శాఖ అధికారులు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ప్రమాదాల నివారణ కోసం కావాల్సిన తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


బాసర-ఓని గ్రామాల మధ్య వంతెనపై నుంచి వరద నీటి ప్రవాహం


బాసర వద్ద గోదావరి పరవళ్లు

బాసర గోదావరి.. ఉగ్రరూపం

- ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు పోటెత్తుతన్న వరద
- ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు

బాసర, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న మహారాష్ట్ర నుంచి గోదావరి పెద్దఎత్తున వరద నీటితో పరవళ్లు తోక్కుతోంది. దీంతో బాసర పుణ్యక్షేత్రంలోని భక్తుల స్నానం ఆచరించే ఘట్టాలన్నీ నీట మునిగి పోయాయి. నది నీటితో నిండుగా రెండు ఒడ్డుల అంచులను తాకుతూ నది ప్రవహిస్తుంది. బాసరకు వచ్చిన భక్తులను నదిలో దిగకుండా బారీకేడ్లు ఏర్పాటు చేశారు. నది ప్రవాహాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మండలంలోని బిద్రెల్లి వాగు పొంగి ప్రవహించడంతో బాసర మండల కేంద్రం, కిర్గుల్(బి), ఓని, గ్రామాల వైపు గల రహదారులపై ఉన్న వాగు వంతెనలు నీట మునిగి పోయాయి. దీంతో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి.


ఏటీసీ ప్రవేశాల పోస్టర్ ప్రదర్శిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీ బాయి

ఏటీసీలలో బాలికలు ప్రవేశాలు పొందాలి : ఈశ్వరీబాయి

ఉట్నూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి ఆధునిక సాంకేతిక విద్య కోర్సులలో బాలికలు అధికంగా ప్రవేశాలు పొంది ఉద్యోగాలు సంపాదించుకోవాలని మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. ఉట్నూర్ ఐటీఐ రోడ్డ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏటీసీ ప్రవేశాల పోస్టర్‌ను మంగళవారం ప్రదర్శించారు. భవిష్యత్తు పరిశ్రమల అవసరాలకు రూపొందించిన ఐటీఐ, ఏటీసీ ఇలా ద్వారా మహిళలు సాంకేతిక విద్యను చదువుకొని భవిష్యత్తులోఉత్తమ ఉద్యోగాలు, స్వయం ఉపాధి పథకాలు సులభంగా పొందవచ్చు అన్నారు. గిరిజన ప్రాంతాలలోని బాలికలు అధికశాతంలో ఏటీసీలలో చేరే విధంగా కృషి చేస్తానన్నారు. ఇందులో రామ్ చందర్, మధుసూదన్, మాణిక్ రావు పాల్గొన్నారు.

'రైతులకు పరిహారం అందేలా కృషి'

నేరడిగొండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వరదలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునుగడంతో పాటు కొట్టుపోయాయి. కాగా మంగళవారం మండలంలోని కుప్టి గ్రామ శివారు ప్రాంతంలో వర్షంతో కొట్టుకుపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అయన వెంట ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావ్. రాజశేఖర్ రెడ్డి, కపిల్‌దేవ్, సద్దాంగౌడ్, మురళీ గౌడ్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ క్యాంపస్‌లో డ్రైడే

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్ క్యాంపస్ ఆవరణలో మంగళవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా రసాయనాలు చల్లారు. కూలర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. అవసరం లేకపోతే కూలర్లను వాడొద్దని మెడికోలకు సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందని, దోమలతో వచ్చే వ్యాధుల నియంత్రణకు అప్రమత్తత తప్పనిసరని రిమ్స్ డైరెక్టర్ పేర్కొన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. డ్రై డేలో భాగంగా నిల్వ ఉన్న నీటిని తొలగించినట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్ మెట్పల్లి వార్, హెల్త్ సూపర్‌వైజర్ ఆడె సురేష్, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వర్ రెడ్డి, ఏఎన్ఎం మమత, సిబ్బంది పాల్గొన్నారు.


శబరిమాతా ఆలయంలో పూజలు చేస్తున్న ఆడే గజేందర్

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత : ఆడె

నేరడిగొండ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పిలుపునిచ్చారు మండలంలోని కుమారి గ్రామంలో మంగళవారం శబరిమత ఆశ్రమ, గురుదేవ్ సేవాశ్రమం కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆశ్రమానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ఆధ్యాత్మికత, క్రమశిక్షణ నిజాయితీగా జీవించడానికి అలవాటును నేర్పిస్తుందన్నారు. ప్రతీ వ్యక్తి భక్తిభావాన్ని అలవర్చు కోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఆశ్రమాలకు ప్రహరీ, బోర్లు త్వరలో మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భూతి నారాయణ, చమేల శంకర్, సుభాష్ గౌడ్, తాళ్ల భోజన్న, మల్లేష్, రాములు, బోథ్ వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, కుమారి మాజీ సర్పంచ్ రాజు యాదవ్, మందుల రమేష్, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బోథ్ ఏఎంసీ డైరెక్టర్ నారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మండపాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి

● ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్


ఉట్నూర్‌లో మాట్లాడుతున్న ఏఎస్పీ కాజల్ సింగ్


నార్నూర్‌లో మాట్లాడుతున్న సీఐ పి.ప్రభాకర్


బోథ్‌లో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

ఉట్నూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉట్నూర్ ఏజెన్సీలో గణేష్ నవరాత్రుల సందర్భంగా గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకుంటున్న మండపాల నిర్వాహకులు అందరూ గణేష్ మండపాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా ఎలాంటి అలజడులు జరగకుండా శాంతియుతంగా నవరాత్రులు నిర్వహించుకోవాలని ఏఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఉట్నూర్ మండలంలో గల వినాయక మండపాల నిర్వాహకులకు విగ్రహం స్థాపించే స్థలం విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, నవరాత్రులు, నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మండపాల వద్ద ఒక్క సౌండ్ బాక్స్ మాత్రం పెట్టుకోవచ్చని, డీజేలో పెట్టుకొని శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. ప్రతీఒక్కరు మండపాల అనుమతులకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, ఎస్సై ప్రవీణ్, సిబ్బంది, ముందు ఉత్సవ సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీరాం నాయక్, సాడిగే రాజేశ్వర్, సాడిగే రాజ్ గోపాల్ పాల్గొన్నారు.

నార్నూర్: గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ పి.ప్రభాకర్ అన్నారు. మంగళవారం రాజులగూడ గ్రామం జాదవ్ సుమన్ బాయి ఫంక్షన్ హాల్‌లో మండల ప్రజల్లో వినాయక చవితి, నిమజ్జన ఏర్పాట్లపై శాంతి సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి మాట్లాడారు వినాయక చవితి వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఉత్స వాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రాంత ప్రజలు సహకరించాలని, డీజేలకు అనుమతి లేదన్నారు. ఎవరైనా పెట్టిన రూ.5 లక్షల వరకు ఫైన్ వేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కూర్చోబెట్టిన విగ్రహాలు పెట్టే వారికి అనుమితి ఉందన్నారు. కొత్తవారికి లేదని, విగ్రహాల సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. మండపల దగ్గర ఎట్టి పరిస్థితుల్లో ఇద్దరు వ్యక్తులు ఉండాలన్నారు. మండపాలు గట్టిగా ఉండే విధంగా చూడాలని, గాలి దుమారం లేసిపోయేలా ఉండకూడదని విద్యుత్ ఇతర సమస్యలు పట్ల జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.అఖిల్, రాయి సెంటర్ సార్మెడి దురుగు పటేల్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గజానంద్ నాయక్, రెడ్డి నాయక్, పాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడె, కాంత రావు దుర్గే,షేక్ పేసా కమిటీ చైర్మన్ సికిందర్ రాథోడ్, దళిత రత్న అవార్డు గ్రహీత కొర్రెల మహేందర్, బీజేపీ మండల అధ్యక్షులు బిక్కు రాథోడ్, జాకిరుల్ల ఖాన్, బ్రిజ్ లాల, సయ్యద్ ఖాసిం, ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

బోథ్: ప్రశాంత వాతావరణంలో గణేష్ పండుగను జరుపుకోవాలని బోథ్ సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ సిరీస్ ఏర్పాటుతో పాటు మండపాలను ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. చిన్న బాక్సులను ఏర్పాటు చేసుకోవాలని, డీజీలకు అనుమతి లేదని పేర్కొన్నారు. రాత్రి పూట మండపాల వద్ద కాపలాగా ఉండాలని సూచించారు. ఎస్సై శ్రీసాయి, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: వినాయక చవితి నవరాత్రులకు అలమతులు తప్పనిసరి అని ఇచ్చోడా సీఐ రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాలకు చెందిన యువకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు మీసేవా ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క వినాయక మండపం వద్ద సీసీ కెమెరాలను అమర్చాలని, డీజే అనుమతులు సైతం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఇమ్రాన్ పోలీసు సిబ్బందితో పాటు వివిధ గ్రామాల యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో భద్రత కరువు!

- కుభీర్ మండలంలో ప్రహరీలు లేని పలుప్రాథమిక పాఠశాలలు
- విద్యార్థులకు తప్పని తిప్పలు


ప్రహరీలేని కుభీర్ ప్రాథమికోన్నత పాఠశాల


ఎలాంటి ప్రహరీ నిర్మాణం లేని కుభీర్‌లోని హరిజన వాడ ప్రాథమిక పాఠశాల భవనం

కుభీర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరి లేక రక్షణ కరువైంది. కొన్ని బడులు ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలల ఆవరణలో పశువులు, శునకాలు, సంచరిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. విష పురుగులు, పాములతో ప్రమాదం పొంచి ఉంది. వీటికి తోడు రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ప్రహరీలు లేని పాఠశాలలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

మండలంలో ప్రాథమిక పాఠశాలలు 51, ప్రాథమికొన్నత పాఠశాలలు 12, ఉన్నత పాఠశాలలు 7, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు 1, ఆశ్రమ టీడబ్ల్యూఏ ప్రాథమికొన్నత పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిసి దాదాపు 3624 పైగా విద్యార్థులున్నారు. అంతేకాకుండా 171 మంది ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు.

● కొన్నిచోట్ల తీవ్ర ఇబ్బంది..

మండల కేంద్రంలోని హరిజన వాడలోని ప్రాథమిక పాఠశాల, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ప్రాథమికోన్నత పాఠశాల, రాజురా, సాయినగర్ తండా, డొడర్న రాంనాయక్ తండా, శంకర్‌నాయక్ తండా, డొడర్న తండా-2, 3,5తో పాటు పలు పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అంతేకాకుండా కొన్ని పాఠశాలలు పంట చేళ పక్కనే ఉన్నాయి. ఆయా పాఠశాలల పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెట్ల పొదలు ఉండడం కారణంగా విష సర్పాలతో ప్రాణభయం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రహరీలు లేక నాటిన మొక్కలను పశువుల ధ్వంసం చేస్తున్నాయి.

అధిక వర్షాలతో ఆందోళనలో అన్నదాత

- దెబ్బతింటున్న పంటల పైర్లు
- లోతట్టు పంటచేలను వీడని వర్షపు నీరు

భైంసా, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా నిర్మల్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆశాజనకమైన స్థితిలోనున్న సాగులోని వివిధ రకాల పంటలు దెబ్బతింటుండంతో ఆవేదనకు లోనవుతున్నారు. యేటా ఏదో ఒక వైపరీత్యం తమను దెబ్బతీస్తోందని కలత చెందుతున్నారు. జిల్లాలో శుక్రవారం మొదలైన వానల జోరు మంగళవారం ఉదయం వేళ కూడా కొనసాగింది. క్రమంతప్పకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో పంట పైర్ల ఎదుగుదల క్షీణించే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక తెగుళ్ల బెడద సైతం పొంచి ఉంది. అధికంగా కురుస్తున్న వానలతో లోతట్టు ప్రాంతాల్లోని పంటచేలలో వర్షపు నీరు నిలిచి పైర్లు మురిగిపోయే స్థితికి చేరుకుంటున్నాయి. ఇక జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో పంట చేలలో నుంచి వర్షపు నీరు ఉధృతితో ప్రవహించడం మూలంగా ఆయా చేలలోని పైర్లకు నష్టం వాటిల్లుతోంది. ఎగువ ప్రాంతం నుంచి వరదనీటితో పాటు మట్టి కొట్టుక వచ్చి దిగువ ప్రాంతాల్లోని పంట చేలలోకి ప్రవహిస్తుండటంతో పైర్లు దెబ్బతింటున్నాయి.


భైంసా ప్రాంతంలోని పంట చేలలో నిలిచిన వర్షపు నీరు

● నిర్మల్ జిల్లాలో 3,97,841 ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలోని నాలుగు వ్యవసాయ డివిజన్ల పరిధిలో ప్రస్తుత వానాకాలపు సీజన్‌లో మొత్తం 3,97,841 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఇందులో అధికంగా వరి 1,54,988 ఎకరాలలో సాగవుతోంది. ఇక మిగతా పంటల సాగు వివరాలను పరిశీలిస్తే పత్తి 1,40,176 ఎకరాలలో, సోయా 1,11,816 ఎకరాలలో, మొక్కజొన్న 15,272 ఎకరాలలో, కందులు 9,310 ఎకరాలలో, పెసళ్లు 260 ఎకరాలలో, మినుములు 145 ఎకరాలలో, పసుపు 6,084 ఎకరాలలో, ఇతర పంటలు 754 ఎకరాలలో సాగవుతున్నాయి.

● నాలుగు రోజుల్లో 30 మి.మీ. వర్షపాతం నమోదు

జిల్లా పరిధిలో శనివారం నుంచి మంగళవారం వరకు నాలుగు రోజులుగా రోజుకు సరాసరి 30 మి.మీ. వర్షపాతం నమోదైంది. 16న జిల్లా వ్యాప్తంగా మొత్తం 336.6 మి.మీ. వర్షపాతం నమోదు అవ్వగా సరాసరి 17.7 మి.మీ. వర్షం కురిసింది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 1195.6 మి.మీ. వర్షం కురవగా సరాసరి 63 మి.మీ. వర్షపాతం నమోదు అయ్యింది. ఇక 18న సరాసరి 16.8 మి.మీ. వర్షపాతం నమోదు అవ్వగా.. జిల్లావ్యాప్తంగా 318.8 మి.మీ. వర్షం కురిసింది. మంగళవారం జిల్లాలో మొత్తం 428.2 మి.మీ. వర్షం కురువగా.. సరాసరి 22.6 మి.మీ.గా నమోదైంది.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 కనిష్ఠం 24.0

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 20 ఆగస్టు 2025

ఆశా వర్కర్లకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లకు సకాలంలో వేతనాలు చెల్లించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో మంగళవారం వైద్యాధికారులను కలిసి వారు వినతిపత్రం అందించారు. ఆశ వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్ వేతనం చెల్లించడంతో పాటు వేతనాలు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. ఇతరత్రా డిమాండ్లను సైతం పరిగణలోకి తీసుకుని వాటిని పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, సుజాత, హారిక, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఫటాఫట్



వ్యాధుల నివారణకు
వైద్య శిబిరాలు

డా.సాధన, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్

ప్రశ్న: సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు: వ్యాధుల నివారణకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలి.

ప్ర: వార్షాకాలంలో ఎలాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది.?

జ: ప్రస్తుతం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇలాంటి సమయంలో విష జ్వరాలు, డయేరియా, మలేరియా, వ్యాధులు సోకే అవకాశం ఉంటుంది. వర్షాలు నిలిచిపోయిన తర్వాత డెంగీ వ్యాప్తికి అవకాశం ఉంటుంది. ప్రజలు ముఖ్యంగా కాచిన నీటినే తాగాలి. అలాగే వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి.

ప్ర: మారుమూల గ్రామాల్లో ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు.?

జ: జిల్లాలో ముందుగానే కటాఫ్ గ్రామాలను గుర్తించి ప్రసవ సమయం దగ్గర పడిన గర్భిణీలను ముందస్తుగా బర్త్ వేయిటింగ్ రూంలకు తరలిస్తున్నాం. దీంతో మాతా శిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. జిల్లాలో 10 బర్త్ వెయిటింగ్ రూంలను ఏర్పాటుచేశాం.

ప్ర: హామ్ సెంటర్లలో సరిపడా వైద్యులు అందుబాటులో ఉన్నారా..?

జ: జిల్లాలో 69 హామ్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో ఎంబీబీఎస్ డాక్టర్లు ఇద్దరు, ఆయుష్మాన్ వైద్యులు ఏడుగురు ఉన్నారు. మిగితా సెంటర్లలో స్టాఫ్ నర్సులతో వైద్య సేవలు అందిస్తున్నాం. సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. మెడికల్ ఆఫీసర్స్ వారి పరిధిలోని ఆసుపత్రిలో సరిపడా మందులు అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి



పాతాల గంగమ్మ.. పై పైకి..
» ఇచ్చోడలో ఉబికి వచ్చిన భూగర్భ జలాలు

మండలంలోని టీచర్స్‌కాలనీలో గతంలో నీటిఎద్దడి నివారణ కోసం బోర్ వేయించారు. ప్రస్తుతం ఎడితెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆ బోరు నుంచి నీరు ఇలా పైకి వస్తున్నాయి. కేవలం 70 నుంచి 80 ఫీట్ల లోతున ఉన్న ఈ బోరుబావి నుంచి నిరంతరాయంగా నీరు వస్తూనే ఉంది. ఈ నీరు మొత్తం ఒకచోట చేరి చిన్నపాటి బావిని తలిపించడం విశేషం. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. - ఇచ్చోడ, ఆంధ్రజ్యోతి



వరద వెళ్లింది.. బురద మిగిలింది
» భీమన్న కాలనీలో స్థానికుల బురద కష్టాలు

గత రెండు, మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని గ్రామాల్లో వరదనీరు చేరి కాలనీలు, వీధులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. ఇళ్ల ముందు నిలిచిన నీటిని గ్రామీణులు ఎక్కడి వారక్కడే కాలువలతో తీసే ప్రయత్నం చేశారు. కానీ నీరు పూర్తిస్థాయిలో వెళ్లలేక బురద మాత్రం అలాగే మిగిలి కనిపిస్తోంది. మండల కేంద్రంలోని భీమన్న కాలనీలో వరద పారి బురద మిగిలిపోవడంతో స్థానికుల కష్టాలు వర్ణణాతీతం. - బజార్‌హత్నూర్, ఆంధ్రజ్యోతి

మూల మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు!
మండపాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి
ఏటీసీలలో బాలికలు ప్రవేశాలు పొందాలి 7లో..

హస్నాపూర్‌లో ఆశా వర్కర్ల ధర్నా
బ్రిడ్జిపై నుంచి లారీ బోల్తా : ఒకరి మృతి
పురుగుల మందు తాగిన బాలుడు 6లో..



చేప పిల్లలు..
వచ్చేస్తున్నాయ్

ఎప్పుడెప్పుడా? అని.. ఎదురుచూస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు సిద్ధమయింది. ఈ మేరకు ఆగస్టు 18న టెండర్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. జిల్లా మత్స్య శాఖ అధికారులు చేప పిల్లల సరఫరాకు టెండర్లను నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. దీంతో ఈ యేడు ఉచిత చేప పిల్లల పంపిణీకి లైన్ క్లియర్ అయ్యింది. జిల్లాలో 270 చెరువులు, కుంటలు, 2 ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో చేప పిల్లలను వదిలేందుకు 224 చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

- » ఎట్టకేలకు ఉచిత పంపిణీకి సిద్ధమైన ప్రభుత్వం
- » టెండర్ ప్రక్రియను చేపట్టాలని అధికారులకు ఆదేశాలు
- » ఆగస్టు 20 నుంచి టెండర్లు, సెప్టెంబరు 1న ఓపెనింగ్
- » నిండుకుండలా కనిపిస్తున్న జలాశయాలు
- » మరింత ఆలస్యమైతే చేపల ఎదుగుదలపై ప్రభావం

ఆదిలాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 107 మత్స్య సహకార సంఘాలు ఉండగా.. వీటి పరిధిలో 5,015 మంది సభ్యులు ఉన్నారు. ఈయేడు కోటీ 16 లక్షల చేప పిల్లలను పంపిణీ చేసేందుకు జిల్లా అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఈ యేడు చేప పిల్లల పంపిణీపై అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ ఎట్టకేలకు ప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి సిద్ధం కావడంతో మత్స్యకారుల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మరింత ఆలస్యమయితే చేపల ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే అదును దాటి పోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. సకాలంలో పంపిణీ చేసి ఉంటే ఉపాధి దక్కేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అనుకున్న గడువులోగా టెండర్ ప్రక్రియ పూర్తయితే సెప్టెంబరు చివరిలో చేప పిల్లలను పంపిణీ చేసే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

స్థానిక డిమాండ్‌ను బట్టి..

జిల్లాలో డిమాండ్ ఉన్న చేప పిల్లల రకాలను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా కట్ల, రవ్, బొచ్చ, బంగారు తీగ లాంటి చేప పిల్లలను పంపిణీ చేయనున్నారు. అయితే గత కొద్దిరోజులుగా సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల్లో రొయ్యలను వదిలేందుకు ప్రయత్నాలు చేస్తున్నా.. ఆశించిన ఫలితం కనిపించడం లేదు. అయితే చెరువులు, కుంటల్లో 35-40 ఎంఎం సైజులో 83 లక్షల చేప పిల్లలు, రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో 80-100 ఎంఎం సైజులో 32 లక్షల చేప పిల్లలను వదలనున్నారు. జిల్లాలో ఎక్కువగా చిన్నపాటి చెరువులు, కుంటలే ఉండడంతో వేసవికి ముందే నీటి నిల్వలు అడుగంటుకపోయే ప్రమాదముంటుంది. ఈసారి ఆలస్యం కావడంతో నష్టపోతామనే ఆందోళన మత్స్యకారుల్లో కనిపిస్తుంది. ప్రతిఏడు జూలై మాసంలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఆగస్టు మాసంలో చేప పిల్లలను వదిలేశారు కానీ.. ఈసారి ఆలస్యం కావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో యేడాదంతా సరిపడ నీటి నిల్వలు ఉండడంతో రొయ్యల పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు.

చేపపిల్లల పంపిణీ టెండర్ ప్రక్రియను ప్రారంభించాం..

: జె.భాస్కర్, జిల్లా మత్స్య శాఖ అధికారి, ఆదిలాబాద్

ఈ యేడు చేపపిల్లల పంపిణీకి అవసరమైన టెండర్ ప్రక్రియను ప్రారంభించాం. టెండర్‌కు అవసరమైన డాక్యుమెంట్స్‌ను ఆన్‌లైన్ లో అందుబాటులో ఉంచాం. సెప్టెంబరు 1న టెండర్లను ఓపెన్ చేస్తాం. ఆ తర్వాత అన్నిరకాల ధ్రువపత్రాలను పరిశీలించి టెండర్లను అప్పగిస్తాం. ఆసక్తి ఉన్న వ్యాపారులు రూ.25 వేల ఫీజును చెల్లించి ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొనవచ్చు. ఏమైనా అనుమానాలు ఉంటే జిల్లా మత్స్య శాఖ అధికారి ఫోన్ నెం.9966225646 ద్వారా సంప్రందించ వచ్చు. గడువులోగా టెండర్లు పూర్తయితే సెప్టెంబరు చివరిమాసంలో చేపపిల్లల పంపిణీ చేపడతాం.

పుష్కలంగా నీటి నిల్వలు

ఈ యేడు జూన్, జూలై వరకు

(తరువాయి 6వ పేజీలో....)


శిబిరాన్ని ప్రారంభించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో అలీంకో ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు గాను గుర్తింపు, నిర్ధారణ క్యాంపు నిర్వహించారు. కలెక్టర్ కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రిజిస్ట్రేషన్, వైద్యుల పరీక్షలను పరిశీలించారు. సదరం సర్టిఫికేట్ ఉన్న పింఛన్ రావడం లేదని, ఆన్‌లైన్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు ఉపరకరణాలు అందించడానికి నిర్వహించే క్యాంపులను వినియోగించుకోవాలన్నారు. గత సంవత్సరం నిర్వహించిన క్యాంపులో కొన్ని ఉపకరణాలు రాలేదని, హెడ్ ఆఫీస్‌లో మాట్లాడి వాటిని కూడా తెప్పిస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్క దివ్యాంగులకు పింఛన్ వచ్చేలా చూస్తామన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తూ సవ్యంగులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో సోమయ్య, సెక్టోరియల్ అధికారులు రఘు రమణ, సుజాత్ ఖాన్ పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీబీ వ్యాధిని నియంత్రించడంలో పురోగతి సాధించామని, అందుకు విశేష కృషి చేసిన జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుమలత గవర్నర్ చేతుల మీదుగా అవార్డు పొందడం అభినందనీయమని డీఎంహెచ్‌ం డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. టీబీని గర్తించడం, చికిత్సలు అందించడం, నియంత్రించడంలో ఆమె చేసిన కృషికి గాను ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా అవార్డు పొందడంతో మంగళవారం ఘనంగా సత్కరించారు. రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ తో పాటు వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అత్యధికంగా ఆదివాసులు ఉండే ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతీ గ్రామంలో పర్యటిస్తూ టీబీని గుర్తించి చికిత్సలు అందించడంలో డాక్టర్ సుమలత కృషి చేశారని డీఎంహెచ్‌ం నరేందర్ రాథోడ్ అన్నారు. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు రావడం ఎంతో సంతోషకరమని, ఇదే స్ఫూర్తితో టీబీ రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. అందరి కృషి, సమన్వయంతోనే మంచి ఫలితాలు వచ్చాయని డాక్టర్ సుమతల తెలిపారు. ప్రతి ఒక్కరు సహకరించడంతోనే అవార్డు వరించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్యూనియన్ హెచ్1 అధ్యక్షులు బండారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి అల్లడి రఘురాం, డాక్టర్ సాయిప్రియ, గంగాధర్, నవీద్, మోసిన్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో కవల పిల్లల జననం

ఇచ్చోడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని మక్రా(బి) గ్రామినికి చెందిన గర్భిణి ప్రతీక్ష పురుటినొప్పులతో బాధపడుతుండడంతో భర్త అనిల్ 108 అంబులెన్స్ వాహనాన్ని సంప్రదించారు. అత్యవసర సిబ్బంది గ్రామానికి చేరుకొని గర్భిణిని ఆసుపత్రికి తరలించే క్రమంలో ఇద్దరు పండంటి కవల పిల్లలకు జన్మనిచ్చింది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. అత్యవసర సిబ్బంది సకాలంలో స్పందించి ఈఆర్‌సీపీ వైద్యుడు కాశీరెడ్డి సలహా, సూచనల మేరకు అంబులెన్స్‌లో డెలవరీ చేయగా.. ఆమాతృమూర్తి ఇద్దరు పిల్లలకు జన్మనించింది. తల్లిబిడ్డలకు ఎలాంటి అపాయం లేకండా క్షేమంగా ఆసుపత్రికి చేర్చినట్లు వారు పేర్కొన్నారు. అంబులెన్స్‌లో కవలపిల్లలు (అమ్మాయిలు) క్షేమంగా ఉన్నట్లు ఈఎంటి రాకేష్, పైలెట్ వినోద్ తెలిపారు. సకాలంలో తల్లిబిడ్డలను క్షేమంగా ఆసుపత్రికి తరలించిన అత్యవసర సేవా విభాగం అంబులెన్స్ సిబ్బందికి కుటుంబసభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.


అంబులెన్స్‌లో జన్మనిచ్చిన కవలలతో అత్యవసర సేవా సిబ్బంది

జిల్లా ఇన్‌చార్జి మంత్రి
జూపల్లికి ఘన స్వాగతం


మంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాజర్షి షా, నాయకులు బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

మావల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కురుస్తున్న అతిభారీ వర్షాలకు గురైన వరద ముప్పు ప్రాంతాలను సందర్శించడానికి జిల్లా కేంద్రానికి వచ్చిన జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకి మావల బైపాస్ వద్ద టీపీసీసీ ఉపాధ్యక్షులు అత్రం సుగుణ, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డిలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారీ వర్షాలతో జిల్లాలో జరిగిన పంట నష్టాల గురించి మంత్రికి వివరించారు. పలు కాలనీల్లో వరదనీరు ఇళ్లల్లో చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందు ఎదుర్కొంటున్నారని, అటు రైతులు చేలల్లోకి వరదనీరు చేరి పంటలు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షాతో పాటు మావల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్, సీనియర్ నాయకులు రేండ్ల రాజన్న, అఫ్సర్ ఖాన్, అలీం ఖాన్, సమీఉల్లా ఖాన్, సంతోష్, గోవింద్, అక్షయ్, దినేష్, తదితరులున్నారు.

నేరడిగొండ: జిల్లాలో గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను, ఇళ్లను పరిశీలించడానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ స్వాగతం పలికారు. బోథ్ నియోజకవర్గంలో తాజా పరిస్థితులపై జిల్లా ఇంచార్జి మంత్రికి నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని లిఖితపూర్వకంగా తెలిపారు. ఇందులో మండల నాయకులు ఆడే వసంత్ రావ్, రాజశేఖర్ రెడ్డి, రాజు యాదవ్, సద్దాం కపిల్ పూతరెడ్డి, తదితరులున్నారు.

రేపు బీఎడ్ ప్రవేశాల కౌన్సిలింగ్

ఉట్నూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన బీఎడ్ కళాశాలలో 2025-27 విద్యా సంవత్సరానికి గురువారం ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అర్హులైన వారు కౌన్సిలింగ్ కు హాజరై ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

108 సిబ్బందికి సూచనలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వానాకాలంలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని 108 సిబ్బందికి డీఎంహెచ్‌ం డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. అర్బన్ వెహికల్‌కు సంబంధించి మంగళవారం ఆయన రికార్డులు తదితర వివరాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని సిబ్బందికి విస్తృత సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. డాక్టర్ వైసి శ్రీనివాస్, ఈఎంటీ రేఖ, పైలెట్ వసీం, విఠల్ గౌడ్ పాల్గొన్నారు.

సమగ్ర నివేదిక అందించాలి

● అధికారులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి ఆదేశాలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదల కారణంగా వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి నివేదిక సమర్పించాలని ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం, సహాయక చర్యలపై పెన్ గంగా గెస్ట్ హౌజ్‌లో మంత్రి జిల్లా స్థాయి సమీక్షించారు. జిల్లాలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులకు సూచనలు చేస్తూ, వరద నష్టంపై శాఖల వారీగా సమగ్రమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నివేదికను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఆ మేరకు నిధులు కేటాయించాలని కోరతానని తెలిపారు. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు, కుంటలు, కాల్వలకు గండ్లు పడ్డ చోట యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతులు చేయాలని, విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు మంత్రికి కలెక్టర్ రాజర్షి షా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పాలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, తదితరులున్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆదిలాబాద్ టౌన్: జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లాండే దత్తు ఈ ఏడాది మే 27న తరోడ వంతెనను దాటేందుకు ప్రయత్నించగా.. తీవ్రమైన నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి దుర్మరణం చెందారు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి మృతుడి భార్య జ్యోతికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావు అందజేశారు. అలాగే భారీ వర్షాలతో ఇండ్లు దెబ్బతిన్న బాధితులు 11 మందికి ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున రూ.44 వేలు అందించారు. పది కిలోల చొప్పున 110 కేజీల బియ్యం అందించారు.



కెమెరాతో సరదాగా ఫొటోలు తీస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఫొటోగ్రఫీలో ఓపిక అవసరం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్
- జిల్లాలో ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఫొటోగ్రఫీలో ఎంతో ఓపిక అవసరమని, ఒక్క క్షణంలో క్లిక్ అనిపించే దృశ్యాలు జీవితాంతం పదిలంగా ఉంటాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎస్‌టీయూ భవన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి స్వచ్ఛందంగా రక్తదానం చేసిన దాతలను అభినందించారు. అంతకు ముందు లాయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ...ఫొటోగ్రాఫర్‌లు తీసే చిత్రాలు పదిలంగా నిలిచిపోతాయని, ఎప్పటికీ గుర్తుండిపోయేలా, అందంగా కనిపించేలా వీడియోలు తీయడం వారికే సాధ్యమని అన్నారు. సంఘ సభ్యులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలనే ఆలోచన ఉందని, ప్రభుత్వ స్థలాలు లేని కారణంగా ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. సంఘం తరపున కలెక్టర్ కు ఇండ్ల స్థలాల విషయంలో వినతి ఇవ్వాలని, అందుకు తన సహకారం సైతం ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఫొటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్, విజయ్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ అశోక్, హరికృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా గౌరవ సలహాదారులు అనిల్ దేశ్‌పాండే, గౌరవ అధ్యక్షులు మురళీధర్, కోశాధికారి సంతోష్, విశాల్ పాల్గొన్నారు.

బోథ్: ఎప్పటి జ్ఞాపకాల్లో మదిలో కురిపించుకునే విధంగా ఉండేది ఛాయాచిత్రమని, దానికి ఎంతో విలువ ఉంటుందని బోథ్, సోనాల మండలాల ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడు లక్ష్మణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మంగళవారం ఛాయాచిత్ర పితామహుడు జుకులాస్ లూయిస్ డాగ్ రే మండే ఒక 171 వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛాయాచిత్ర ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రంజిత్, కోశాధికారి కాడెరుగుల గణేష్, అడపు నరేష్ కుమార్, రవీందర్, బోడా లక్ష్మణ్, దేవేందర్, కుశాల్ రెడ్డి, నితీష్ గౌడ్, రాజశేఖర్, సురేష్, ప్రకాష్, జీకే కిరణ్‌తో పాటు పలువురు ఫొటోగ్రాఫర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 186వ ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా రూపకల్పన సృష్టించిన లూయిస్ జాక్వెస్ మండే డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్లు సురేష్, అన్వేష్, రాము, అశోక్, శేఖర్, సంతోష్, వినోద్, తదితరులు ఉన్నారు.